
రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో మహిళల హోలీ సంబురాలు


అల్లాదుర్గం : హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత


చిన్నశంకరంపేటలో హోలీ వేడుకల్లో యువకులు

# రంగు రబ్బ రబ్బ..

## రంగులమయమైన ఊరూవాడా

- సంబురాల్లో మునిగితేలిన ప్రజలు
- చిన్నాపెద్ద తేడాలేకుండా రంగులాడిన జనం
- పాటలు పాడుతూ కేరింతలు కొట్టిన యువత

**రంగుల పండగ** అందరి జీవితాల్లో రంగులు నింపాలని కోరుకుంటూ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. పల్లె, పట్టణం, ఊరూ వాడా రంగులతో నిండిపోయాయి. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రంగుల దుకాణాలు సందడిగా మారాయి. రసాయన రంగుల కంటే సహజ రంగులే మేలని భావించిన ప్రజలు వాటితోనే రంగులాడారు. పాటలు పాడుతూ కేరింతలు కొడుతూ యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ రంగులాడారు. అనంతరం కలకాలం అందరి జీవితాలు రంగులమయం కావాలని భావిస్తూ చిన్నారులకు చక్కర పేర్లు, కుడుకల పేర్లు వేసి ఆశీర్వదించారు.

*-మెదక్ జిల్లా నెట్‌వర్క్, మార్చి 25*


టేక్మాల్‌లో యువకుల హోలీ సంబరాలు


వెల్దుర్తి: నెల్లూర్‌లో హోలీ సంబురాలు జరుపుకొంటున్న యువత


మెదక్ పట్టణంలో హోలీ ఆడుతున్న మహిళలు


నర్సాపూర్‌లో హోలీ సంబురాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్


మెదక్ మున్సిపాలిటీ : హోలీ ఆడుతున్న చిన్నారులు


చిలిపిచెడ్: గౌతాపూర్‌లో హోలీ ఆడుతున్న యువకులు


పెద్దశంకరంపేటలో హోలీ సంబురాలు


మెదక్‌రూరల్ : హోలీ వేడుకల్లో మహిళలు


రేగోడ్‌లో హోలీ సంబురాలు

## పాపన్నపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన


తమ్మయపల్లిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్ రావు

పాపన్నపేట, మార్చి 25: పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి అనంత పద్మనాభ స్వామి జాతరలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తమ్మయపల్లిలో మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి డాక్యతండాకు చేరుకుని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ ఎంపీటీసీ మౌనిక రాజును పరామర్శించారు. అనంతరం పొడిచాన్పల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాపన్నపేట మండలంలో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కాలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. ఇప్పటి నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, గోవింద్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్, పాపన్నపేట ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

## కరాటేలో నీరజ్‌కు బ్లాక్ బెల్ట్


కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన నీరజ్

పాపన్నపేట, మార్చి 25: మండలంలోని మిన్పూర్ గ్రామానికి చెందిన నీరజ్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని ఐ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన కరాటే బెల్ట్ పోటీల్లో నీరజ్ బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఈ పరీక్షలకు నిర్వాహకులుగా కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ రింగ్జూకి చోటకాన్, క్లబ్ ఫౌండర్ మాస్టర్ నగేశ్ వ్యవహరించారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

చిలిపిచెడ్,(కొల్చారం), మార్చి 25: కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని అర్చకుడు నాగరాజు పంతులు, కృష్ణ త్రిపాఠితో పాటు ఇతర పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాధవానంద సరస్వతీ స్వామి హాజరై భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామానికి చెందిన యెల్లుగారి రామకృష్ణారెడ్డి, శ్రీమతమ్మ దంపతులు, కుమారుడు ప్రమీణ్ చంద్రారెడ్డి, నీలిమా, నవీన్ చంద్రారెడ్డి, పల్లవి దంపతులు స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఎల్లుగారి లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు.

## ‘కోడ్’ కూసినా తొలగని పార్టీ గుర్తులు


చందూర్‌లో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడి ఇంటికి ఉన్న కమలం పువ్వు గుర్తు

చిలిపిచెడ్, మార్చి 25: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ రాజకీయ పార్టీల ఎన్నికల రాతలు ఇంకా తొలిగించలేదు. చిలిపిచెడ్ మండలంలోని చందూర్ గ్రామంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడి ఇంటికీ, మరో నాయకుడి ఇంటికి బీజేపీకి సంబంధించిన కమలం పూవ్వు గుర్తులు ఉన్నాయి. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రాతలు, గుర్తులు కనిపిస్తున్నాయి. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రాతలు, గుర్తులను అధికారులు తొలిగించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రెండు వారాలు గడుస్తున్నా రాజకీయ పార్టీ ఎన్నికల నినాదాలు, గుర్తులు నేటికీ దర్శనమిస్తున్నాయి. దీన్ని అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

## బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి

రామాయంపేట, మార్చి 25: మెదక్ పార్లమెంటు స్థానాన్ని భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని, బీఆర్ఎస్ మెదక్ కంచుకోట లాంటిదని పార్టీ మండల అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భూమగారి నర్సాగౌడ్ అన్నారు. సోమవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. నేడు మెదక్‌లో జరిగే బీఆర్ఎస్ ఎంపీ నియోజకవర్గ సమావేశానికి రామాయంపేట, నిజాంపేట రెండు మండలాల నుంచి పార్టీ ముఖ్య కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు కాట్రియాల శ్యాములు, సుభాష్ రాథోడ్, మల్లేశం, సురేశ్, నాయకులు ఇమానియేల్, స్వామి, ఉమామహేశ్ తదితరులు ఉన్నారు.

## భగవద్గీత చాలా గొప్పది


రామాయంపేట గీతాభవనంలో హోమం నిర్వహిస్తున్న శతావధాని ప్రభాకరశర్మ

రామాయంపేట, మార్చి 25: వేదాల్లో భగవద్గీత చాలా గొప్పదని. అందులో వేదాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులు ఉంటాయని శతావధాని దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. సోమవారం రామాయంపేటలోని గీతా భవన్ 30వ వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. పట్టణంలోని గీతా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గీతా భవన్‌లో హోమాలు నిర్వహించి, భక్తులకు గీతోపదేశం చేశారు. భగవద్గీత ప్రతి ఒక్కరిలో శాంతి, ధైర్యం, ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. రామాయంపేటలో భగవద్గీత సారాన్ని ప్రముఖ వేదాంతి, సంస్కృత పండితులు దోర్బల విశ్వనాధశర్మ, బల్ల రాజయ్య ప్రారంభించారన్నారు. మూడు దశాబ్దాలుగా గీతా సారాన్ని ప్రతిరోజు ఉదయం, సాయంకాలం గీతా భవనంలో పటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు సంగమేశ్వర్, పండరీనాథ్, రఘుపతిగౌడ్, కైరంకొండ తిరుపతి, ముత్యాలు, పుట్టి మల్లేశం, రవీందర్, పబ్బ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## నేడు పలు ఆలయాల వార్షికోత్సవాలు

కౌడిపల్లి, మార్చి 25: కౌడిపల్లిలోని శివ పంచాయతన నవగ్రహ సహిత దాసాంజనేయ స్వామి, పోచమాంబ, రేణుకా ఎల్లమ్మ ఆలయాల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవతామూర్తుల అభిషేకం, అలంకరణ, గోపూజ, గురు పూజ, గణపతి పూజ స్వస్తివాచనం, ఆంజనేయ స్వామికి సామూహిక చతుర్థ సహస్ర నాగవల్లి పత్రార్చన, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## టెట్ ఫీజు తగ్గించాలి


బాలసాయి హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 25: టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలని విద్యా వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాయి హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాం లో నిర్వహించిన టెట్ పేపర్-1కు రూ. 300, పేపర్-2కు రూ.300 చొప్పున ఫీజుతో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం రూ.వెయ్యి ఫీజు పెంపుతో టెట్ అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు పునరాలోచించి ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ఏటీఎంలో చోరీకి యత్నించిన ఇద్దరికి రిమాండ్

చిన్నశంకరంపేట, మార్చి 25: ఏటీఎంలో చోరీకి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ సోమవారం తెలిపారు. ఈ నెల 23న అర్ధరాత్రి గవ్వపల్లి చౌరస్తాలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీకి ప్రయత్నించిన గజగట్లపల్లి గ్రామానికి చెందిన పసుల ప్రవీణ్‌కుమార్, ముత్తగారి మహేశ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సిబ్బందిని రామాయంపేట సీఐ వెంకటేశ్ అభినందించారు.

## మహిళ అదృశ్యం


ప్రమీల (ఫైల్)

శివ్వంపేట, మార్చి 25: మహిళ అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబ్‌పేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి ప్రమీల (47) గ్రామంలోనే నివసిస్తున్నది. ఆమె కుమారుడు సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి వృత్తిరీత్యా మేడ్చల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 17న నవాబ్‌పేటకు వచ్చిన కొడుకు శ్రీధర్‌రెడ్డికి ఇంటి వద్ద తల్లి కనిపించలేదు. అతని అక్క దగ్గరకు వెళ్లిందేమోనని ఆరా తీయగా ఈ నెల 15న రాత్రి నర్సాపూర్‌లో ఉన్నానని, ఆలస్యమైందని ఆమెకు తెలిసిన భారతమ్మ వద్ద ఉంటానని చెప్పిందని శ్రీధర్‌రెడ్డికి అక్క తెలిపింది. అప్పటి నుంచి ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తున్నది. భారతమ్మ దగ్గరకు వెళ్లినా ఆచూకీ లేదు. తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ప్రమీల కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

## పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ ఆహ్వానం

చేగుంట, మార్చి 25: మండలంలోని మక్కరాజిపేటలో ఉన్న పెద్దమ్మ తల్లి వనదుర్గ ఆలయ వార్షికోత్సవానికి రావాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును ఆలయ కమిటీ సోమవారం ఆహ్వానించింది. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 2 వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో ముదిరాజ్ సంఘం నాయకులు చెన్నబోయిన లింగం, జింక శ్రీనివాస్, బంగారు భిక్షపతి, కాశబోయిన యాదగిరి, చెన్నబోయిన ఎల్లం, మెగులయ్య, రంగ కృ ష్ణ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

కౌడిపల్లి, మార్చి 25: వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కౌడిపల్లి గ్రామానికి చెందిన రాజం భూమయ్య (70) ఆదివారం రాత్రి తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. రోజూ పొలానికి వెళ్తూ అడవి పందులు రాకుండా కాపలా కాస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం రాత్రి భోజనం చేసి పొలానికి వెళ్లాడు. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన రంగయ్య, భూమయ్య ఇంటికి పని నిమిత్తం వెళ్లి ఇంట్లో అడిగారు. భూమయ్య రాత్రి పొలానికి వెళ్లి ఇంకా ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తున్నదని, పొలానికి వెళ్తే అక్కడ ఉంటాడని కుటుంబీకులు చెప్పారు. దీంతో రంగయ్య పొలానికి వెళ్లి చూడగా మంచంపై పడుకుని రగ్గు కప్పుకుని ఉన్నాడు. గొడ్డలితో నరికి హత్య చేసినట్లు ఉంది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు వెంటనే పలువురు గ్రామస్తులతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కౌడిపల్లి ఎస్సై రంజిత్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుమలేశ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు భూమయ్యను మరొకచోట గొడ్డలితో ముఖం, వీపుపై గాయపరిచి, మృతిచెందాక పొలంలోని మంచంపై పడుకోబెట్టి ఎప్పటిలాగే రగ్గు, టవల్ కప్పి వెళ్లిపోయారని తెలిపారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.